కథానిక

# చేతులు చాచే గోడలు

ద్రోణంరాజు కృష్ణమోహన్

సత్యనారాయణ తడబడుతూ, దిక్కులు చూస్తూ సబ్ రిజిస్ట్రారు ఆఫీసు మెట్లెక్కుతున్నాడు. మొదటిసారి రావడం. ఎప్పుడూ యీ రిజిస్ట్రేషన్ వ్యవహారాలు అనుభవం లేనందున కొత్తగా, అదోలా తోచింది.

"ఏమండోయ్ పంతులుగారూ! ఇలా దయ చేశారు! ఏదో విశేషం" దస్తావేజుల నిపుణుడు రామావధాని కళ్లజోడు తీస్తూ, నవ్వుతూ పలకరించాడు.

"మరేనండి పనుండికొంచెం..." అని ముక్తసరిగా జవాబిచ్చాడు సత్యం.

"అలా నిలబడతేవేమిటయ్యా? రా. కూర్చో. ఏమిటో సంగతి చెప్పు" రామావధాని ఆహ్వానించాడు. సత్యనారాయణకు అతనితో అంత బాగా పరిచయం లేదు. ఎప్పుడో తన తండ్రితో అప్పుడప్పుడు మాట్లాడుతూండగా చూశాడు. అయినా ఇంత ఆప్యాయంగా పిలవడం ఆశ్చర్యం కలిగించింది.

"మరేమీలేదు, మీకు తెలుసుగదూ మా నాన్నగారికి బాగా జబ్బు..." మాట పూర్తి కాకముందే రామావధాని అందుకుని,

"మరె... మరె... విన్నా. ఏమిటో పెద్ద వాడు. నాకన్న పది పదిహేనేళ్లు పెద్ద. దాటిపోయాడు పాపం" అని సానుభూతి వాక్యాలు పలికాడు.

"అంతా చిక్కులో పెట్టిపోయాడు."

"ఉంటాయి, ఉంటాయి మరి ఆఁ. ఇంతకూ పనేమిటి?" అని ప్రశ్నించాడు.

"మా అమ్మపేర రెండెకరాల పొలం, నాకు ఆ చిన్న పెంకుటిల్లు రాసియిచ్చారుగదూ" అని చెప్పబోతూండగా

"నాకు తెలియదూటయ్యా దస్తావేజు రాసిన వాడికి?" అని నవ్వుతూ పొడుంకాయ తీసి పీల్చి రెండు తుమ్ములు వరుసగా తుమ్మి "ఆఁ కానీ చెప్పు" అన్నాడు.

"ఏమీలేదు. మా చెల్లెలి పెళ్ళిచేద్దా మనుకున్నాం. ఆ రెండెకరాలూ అమ్మక తప్పడంలేదు."

"అయ్యో! అమ్ముకుంటున్నారా! అవునులే మరి అవసరం. ఎన్నాళ్లు యీడొచ్చిన పిల్లని యింట్లో పెట్టుకుని కూర్చుంటాం?" అన్నాడు.

"మా పెదనాన్న భార్య కొంటానంది ఐదు వేలకి. కాస్త మీరు చూడాలి. ఈ రిజిస్ట్రీషను గొడవలు తెలియవు" అన్నాడు విసుగ్గా.

"అంతకన్నానా! మే మిక్కడ కూర్చున్నది దేనికి?"

"ఎంతవుతుందంటారు ఖర్చు?" ప్రశ్నించాడు.

"ఎంతకు స్టాంపు కడదాం యింతకూ?" అని అడిగాడు అవధాని.

"ఐదువేలకేగా అమ్మేది. దానికెంతవుతుందో తీసెయ్యండి."

"ఓరి పిచ్చిపంతులూ! అంత విలువ కడతారటోయ్! మనం నిజంగా అమ్మే ధర యిక్కడ లెక్కలోకి తీసుకుంటే ఎలా? స్టాంపు ఎక్కువ పడదూ?" సత్యం అమాయకత్వానికి, అన్నాడు నవ్వుతూ.

"మరి తక్కువ కడితే, రిజిస్ట్రారు వొప్పుకుంటాడూ?"

"ఇక ఆ విషయాలన్నీ నాకు వొదిలెయ్యి. మూడువేలకు ఖాయం చేయిస్తా. చూడూ... నాలుగు డబ్బులూ వాడి మొహాన పారేస్తే యివన్నీ వాడు చూస్తాడూ? అయినా వాడికెందుకూ మన యెంతకమ్ముకుంటే!" అని చెవిలో గొణిగాడు.

"అయితే లంచం యివ్వాలంటారు మీరు?" అన్నాడు సత్యం.

"తప్పుతుందా లేకపోతే మరి? రకరకాల ప్రశ్నలు వేస్తాడు. ఆ లోపం వుంది, యిక్కడ యీ లోపం వుంది అంటూ ఏదో పేచీపెడుతూ. అందుకనే యేదో ఒక్క ముప్ఫరూపాయలు... పోనీ పాతిక మనవి కావనుకో. మన అవసరం మరి. మనకే లాభమేగా చూడు" అని వొప్పించాడు. సత్యానికి లోపల మండిపోయింది. రిజిస్ట్రారును అమాంతంగా చంపేద్దామన్నంత కోపంవచ్చింది. వెధవ లంచాలు వీళ్ళూనూ! ఈ డిపార్టుమెంటు మరీ ఘోరం' అని నాలుగు వైపులా చూశాడు. అంతే... రైతులు, పొలాలు గట్రా అమ్ముకునే వితంతువులు, పేదరైతులు— పల్లెటూరి రిజిస్ట్రారు ఆఫీసుదగ్గర అంతకన్న ఎవరు కనబడతారు! "అబ్బ! ఏం గుంజేస్తున్నాడు యీ రిజిస్ట్రారు" అనుకున్నాడు మనస్సులో. కాని ముందు పనికావాలి! ఒప్పుకోకతప్పలేదు.

"మరి మీ కెంత పుచ్చుకుంటారు రాసినందుకు" అని అడిగాడు అదోమాదిరిగా.

"అదేం ప్రశ్నోయ్! నీ యిష్టం. అది అడిగే ప్రశ్నా? నీకుతోచింది యియ్యి! మనలో మనకేమిటి?" అన్నాడు. చాలాసంతృప్తిపడ్డాడు సత్యం.

మర్నాడు ఒంటెద్దు బండిమీద సత్యనారాయణ తన చెల్లెల్ని, తల్లినీ, పెదతల్లినీ వెంటబెట్టుకొచ్చాడు ఆఫీసుకి అప్పటికే కాగితాలు రాసి సిద్ధంచేసి వుంచాడు రామావధాని. సాక్షి సంతకాలు చేశారు అరుగుమీద కూర్చున్న పనిలేని యిద్దరు పెద్దమనుషులు.

"వాళ్ళిద్దరికీ చెరొక రూపాయి మొహాన పారేద్దూ" అన్నాడు అవధాని.

"అదేమిటండీ, సాక్షిసంతకాలకి కూడా మామూళ్ళా? ముందుచెప్పితే, నేను మా పక్క యింటివాళ్ళచేత పెట్టించే వాడినే" అన్నాడు.

"వాళ్ళంతా నీకోసం ఇక్కడకొస్తారుటోయ్! వాళ్లు అక్కడ పెట్టినా, యిక్కడ వేలిముద్ర వేసేటప్పుడు వేరేపెట్టాలితే" యివ్వకతప్పలేదు. ఇహ బాగుండదనుకొన్నాడు.

దస్తావేజుతోపాటు రెండుపదులనోట్లు, ఒక ఐదురూపాయలనోటు మడిచి పైకి కనబడనీయకుండా బహునేర్పుగా ఎవరూ చూడకుండావుండేట్లుగా రిజిస్ట్రారు చేతికందించాడు రామావధాని రిజిస్ట్రారు పెదవివిరచి, అదోమాదిరిగా అవధాని వైపు చూశాడు.

"ఆ ఐదుకూడా యిలాయిచ్చెయ్యి. వెధవ గొడవ" అని చెవిలో గొణిగాడు అవధాని. పక్కన నలుగురూవున్నారు. నెమ్మదిగా అందించాడు సత్యం ఆ ఐదుకూడా.

పెదతల్లినీ, తల్లినీ, చెల్లెల్ని తిరిగి పంపించాడు సత్యం.

"పదబాబూ... అలా వొక్కసారి గుమాస్తాల దగ్గరికి. ఆ దస్తావేజు కాస్త వాళ్ళకి విప్పిచెపితే, కాపీవ్రాయటానికి యిహ చిక్కేమీ వుండదు" అని రిజిస్ట్రారు ఎదురుగా కూర్చున్న గుమాస్తాల దగ్గరకు తీసుకెళ్ళాడు అవధాని సత్యాన్ని.

"రండి, రండి... శేషయ్యగారి అబ్బాయిగదూ? ఓహో! పూర్వనుంచికూడా శేషయ్యగారివంశం... మా వంశం..." అని నవ్వుతూ ఆహ్వానించాడు ఎంతో గౌరవంగా అందరిలోకీ పెద్దగుమాస్తా.

"ఆఁ... చూడు... అందరి విషయంలోలాగ కాకుండా వీరివిషయంలో దస్తావేజు రాసివ్వడం చకచకా జరిగిపోవాలి" అన్నాడు అవధాని.

"అదివేరే చెప్పాలా? నాకు తెలియదూ? మరి హాఁ - హాఁ..." అని తలగోక్కుంటూ దస్తావేజు మొదటి రెండుకాగితాలు చప్పుచప్పున చదివేసి "చాలా అట్టహాసంవుంది. వ్రాయవలసింది మరి చాలావుంది" అని గొణిగాడు.

"అందరిలాగ కాకుండా కొంచెం తగ్గించి పుచ్చుకో" అన్నాడు అవధాని.

"అంటే మీకుకూడాయేదన్నా" అని నెమ్మదిగా అన్నాడు సత్యనారాయణ సందేహంగా.

"ఏదో వాళ్ళకి మామూళ్లుంటాయిలే. ఇవ్వకపోతే..." అని అవధాని అంటూ యింకా చెప్పబోతుండగానే సత్యం జేబులోనుంచి రెండు ఐదులుతీసి "ఎంతివ్వమంటారు?" అని అడిగాడు.

"అబ్బే! ఒక్కటిచాలు. ఆదైనా నువ్వుకాబట్టి" అని సర్దాడు రామావధాని.

సత్యం మారు మాటాడకుండ చేతిలోపెట్టి యివతలకొచ్చాడు చకచకా

"చిత్తం.. హాఁ...హాఁ.. " అని చేతులు నలుపుకుంటూ పళ్ళికిలిస్తూ వెంట పరుగెత్తుకొచ్చాడు జవాను.

"వాడికెంతలే! ఒక్కరూపాయి. ఏదో కాఫీ నీళ్ళకు యేడుస్తాడు" అన్నాడు మొహం ప్రక్కకి తిప్పుకుని అవధాని.

"చిత్తం. తమ సంతోషం" అన్నాడు జవాను. జేబులో రూపాయిబిళ్ళతీసి జవానువైపుకూడా చూడకుండా చేతిలో పెట్టాడు.

"అలా కాఫీతాగి పోదువుగానిరా" అని దారి తీశాడు అవధాని.

"ఏంతీసుకుంటూరు మీరు?" అని అడిగాడు సత్యం.

"అబ్బే! నాకేంగావాలయ్యా? ఒక్క పెసరట్టు కాసిని కాఫీనీళ్ళు, పడేస్తే యేదో ఆ మైసూరు పాకంముక్క పడేయించు" అని తనవంతు అర్థరూపాయిదాకా బిల్లుచేశాడు.

బయట రెండు కిళ్ళీలు నమిలారు.

"ఈ మధ్య చుట్టలుకూడా అలవాటైనాయి వెధవది" అని జేబుతడుముకున్నాడు సత్యం చూస్తూండగా. సత్యం అర్థం చేసుకున్నాడు. అవొకబిల్లు!

"మరిహ మీకెంత గావాలో చెప్పండి" అన్నాడు సత్యం.

"అయ్యయ్యో! అదేమిటయ్యా ఆలా అడుగుతావ్! ఏదో తోచిందిలా పారెయ్యి. నేనేం వందలూ, వేలూ తీసుకుటూనా?" అన్నాడు.

ఐదురూపాయలుతీసి చేతికివ్వబోయాడు. అవధానికి సంతృప్తి కలుగలేదు.

"అదేమిటి పంతులూ! బొత్తిగా ఐదుముక్కలా" అన్నాడు అక్కర్లేదన్నట్లుగా.

"ఫరవాలేదు. ఇంతకన్నా ఎవరు ఎక్కువివ్వరనుకుంటూ" అని చేతిలో పెట్టబొయ్యాడు.

"ఎంతపనిచేశాను? ఎన్ని యేర్పాట్లు చేశాను? రోజల్లా మీతో నేవున్నా యితర దస్తావేజులు మానుకుని" అని గొణిగాడు.

"అందుకే నేను ముందర చెప్పమన్నాను... తీసుకోండి యీ రెండూకూడా" అని యిచ్చాడు.

"సంఖ్య బాగుండలేదు ఆలా శేషం వుంచకూడదు. మీదగ్గిర కాబట్టి పది. మరొకళ్ళయితే పదిహేను, యిరవై కూడాను" అని కుండ బ్రద్దలకొట్టినట్టు చెప్పాడు. 'యింకా ఈయనతో ఎన్ని అవసరాలు వస్తాయో!' అని అనుకుని మనసులో మిగత మూడు వేసి మొత్తం పది యిచ్చాడు.

"చిత్తం! సెలవు మరి! ఏ అవసరమొచ్చినా దగ్గిరకి పరుగెత్తుకురండి. 'కేరాఫ్ రిజిస్ట్రాఫీసు అరుగు' అని వొక వుత్తరంముక్క వ్రాసినా నీకేపనిగావాలన్నా చేసిపెడతా. నువ్వు వుద్యోగానికి సెలవు పెట్టి రానక్కర్లేకుండా" అని రెండుచేతులూ అతి వినయంగా జోడించి సెలవుతీసుకున్నాడు. అటువైపు చూడకుండానే ఒక ప్రతివందనం పారేసి యింటిదారిబట్టాడు సత్యం.

"అబ్బ! ఏం లంచాలు! వీళ్ళ దుంపతెగ! తెగ కాజేస్తున్నారు. రిజిస్ట్రారు ముందు గుమాస్తాలు, గుమాస్తాల కళ్ళ ఎదుట రిజిస్ట్రారు. వీళ్ళందరూ చూస్తూవుండగ జవాన్లకు ముడుపులు! ఎంత నిర్భయంగా అడుగుతారు ఒక్కొక్కళ్ళు! నిజంగా యిలాంటి ఆఫీసు నేనెక్కడా చూడలేదు. భలే డిపార్టుమెంటురా! వీళ్ళని ఒక్కొక్కళ్ళని ఒక్కొక్క చెట్టుకి వేళ్ళాడగట్టాలిరా" అని మరునాడు సాయంత్రం బెజవాడ 'డాలీపార్కు'లో మిత్రబృందం సమావేశంలో గంభీరంగా ఉపన్యసించాడు.

"అయినా నీలో మాత్రం లంచగొండి స్వభావం మరోరూపంలో లేదుట్రా?" అని ఒక మిత్రుడు ప్రశ్నించాడు.

"ఛ, ఛ! దాన్ని నిర్మూలించడానికి కంకణం గట్టుకున్నానని మీకందరకీ తెలుసుగదట్రా!"

"ఏడిశావులే! ఐదువేలరూపాయలు పైగా అమ్మితే స్టాంపు డ్యూటీ ఎక్కువని మూడు వేలకు రిజిస్టరు చెయ్యలా? నువ్వేగనుక మొనగాడివైతే, యీ పార్కులో యీ చెత్తంతా మా ముందు వెళ్ళబోసేబదులు ఐదువేలకు స్టాంపు కట్టుకుని అవసరమైతే నాలుగుడబ్బులు ఖర్చుపెట్టి పై ఆఫీసర్లదాకా వెళ్ళి ఎందుకు రిజిస్టరు చెయ్యనంటాడో, యీ లంచాలు, మామూళ్ళు, ఎందుకివ్వాలో తేల్చుకోకపోయినావ్?" అన్నాడు ఘాటుగా ఆ మిత్రుడు. సత్యం తెల్లబోయాడు.

"అయినా అప్పుడు మాత్రం! ఐదువేలు పెట్టుకున్నా, యీ మామూళ్లు, లంచాలు, సంతోషాలు యివన్నీ తప్పుతాయిట్రా? పైగా పైవాళ్ళ దగ్గరికి వెళ్ళి రిపోర్టు చెయ్యడమంటే మాటలా? దానికెంతకథ జరగాలి" సమర్థించుకున్నాడు. ★